ప్రజాశక్తి
మంగళవారం 15 జులై 2025
5
పార్వతీపురం మన్యం

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

ప్రజాశక్తి-సీతంపేట

ఇటీవల ప్రతిరోజూ వర్షాలు కురుస్తుండడం, తీవ్రమైన ఎండలో కాయడంతో ప్రజలు రెండింటిని తట్టుకోలేక జ్వరాలతో బాధపడుతున్నారు. ఏరియా ఆస్పత్రికి, సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సీతంపేట ఏరియా ఆస్పత్రి రోగులతో రోగులతో కిక్కిరిసింది. ఒపి కౌంటర్ మాత్రమే కాకుండా ప్రతీ వైద్య నిపుణుల కేబిన్ వద్ద రోగులు క్యూ కట్టారు. సోమవారం 442 ఒపి నమోదైంది. 49 ఇన్ పేషెంట్లు ఉన్నారు. 94 మంది జ్వరాలతో బాధపడుతున్నారు. 18 మంది మలేరియా అనుమానితులుగా ఉన్నట్లు సమాచారం. ఒకరికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారించారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఒపి విభాగంలో వైద్య సేవలందించారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యా రంగ సమస్యలపై

కదంతొక్కిన విద్యార్థులు

- పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన భారీ ర్యాలీ
- ధర్నా చేయకుండా అడ్డుకున్న పోలీసులు
- కలెక్టరేట్ గేటు వద్దే బైఠాయించిన విద్యార్థులు
- జెసి హామీతో ఆందోళన విరమణ
- పిజి సెంటర్, డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ డిమాండ్

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు కదంతొక్కారు. సోమవారం పార్వతీపురం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గేట్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో బయట విద్యార్థులు బైఠాయించారు. అధికారులు స్పందించకపోవడంతో కలెక్టర్ బయటకు రావాలని విద్యార్థులు పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ వెనుక బడిన మన్యం జిల్లాలో నాణ్యమైన విద్య అందడం లేదని చెప్పారు. విద్యార్థుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వ తీరు దారుణంగా ఉందన్నారు. జిల్లాలో విద్యారంగ సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు నామమాత్రపు పర్యటనలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పార్వతీపురం కేంద్రంగా పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఈ విద్యా సంవత్సరం నుండి అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, డిగ్రీలో డబుల్ విధానంలో కొనసాగించాలని కోరారు. జిల్లా సెంటర్లో ఎస్‌సి, బిసి హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌టి హాస్టళ్లకు అదనంగా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంల పోస్టులు భర్తీ చేయాలని, జిల్లాలో స్కూళ్ల మూసివేత ఆపాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.అఖిల్, కె.రాజు మాట్లాడుతూ ఎమ్మార్ నగర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థుల కోసం స్పెషల్ బస్సులు వేయాలన్నారు. బలిజిపేట మండలం పెదపెంకి పాఠశాలలో చదివే విద్యార్థులను బలవంతంగా పలగర తరలిస్తుండడం సరికాదని చెప్పారు. పార్వతీపురం మండలం కోరి గ్రామంలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల మూసివేతకు హెచ్ఎం.. చైర్మన్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని విమర్శించారు. మక్కువ, పాలకొండ ప్రాంతాలలో కూడా స్కూళ్లను మూసివేసే కుట్రలు చేస్తుండటం దారుణమన్నారు. వెంటనే అటువంటి నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

జెసికి సమస్యలను వివరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతరం జాయింట్ కలెక్టర్ శోభిక బయటకు వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సింహాచలం, కె.డేవిడ్, పట్టణ నాయకులు జి.సురేష్, కె.రాజేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను లోపలికి రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

నారుమడికి నీరు కడుతున్న రైతు

ఎండుతున్న నారుమడులు

మోటార్ల సహాయంతో తడుపుతున్న రైతులు

ప్రజాశక్తి-వీరఘట్టం

రైతులు ఎన్నో అష్టకష్టాలు పడి విత్తనాలు సంపాదించి, చల్లితే, అవి మొలకెత్తి పచ్చగా ఉండాల్సిన నారుమడులు ఎండల ప్రభావంతో మాడిపోతున్నాయి. వరుణుడి కరుణ కోసం ప్రతిరోజూ ఆకాశం వైపు చూడాల్సిన దుస్థితి దాపురించింది. మండలంలోని ఈ ఏడాది 16,500 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేయాల్సి ఉంది. 2,465 ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే అన్నదాతలు ఎదలు చల్లినట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. గత వారం రోజులుగా ఎండ ప్రభావం రోజురోజుకీ అధికం కావడంతో వర్షాలు కురవక నారుమడులు ఎండిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అవకాశమున్న చోట రైతులు మోటార్ సహాయంతో నారుమడులకు నీరు కట్టి జీవం పోస్తున్నారు. ఏ అవకాశమూ లేని రైతులు ఆకాశం వైపు చూస్తూ కన్నీరు కారుస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది పంటలపై ఆశలు వదులుకోవడమేనంటూ ఆవేదన చెందుతున్నారు.

ఎండిన నారుమడి

పేదలకు అండగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-సాలూరురూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా ఉంటుందని మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. రూ.4,53,181 మొత్తాన్ని ముగ్గురికి అందజేశారు. అనారోగ్య సమస్యల సమయంలో అందిన ఈ ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో దోహదపడిందని మంత్రి తెలిపారు.

వితంతు పింఛన్ల కోసం ధర్నా చేస్తున్న బాధితులు, వ్యకాస జిల్లా ప్రధానకార్యదర్శి గంగునాయుడు

వితంతు పింఛన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

మండలంలో సంగంవలస, గంగాపురం, ములగ, డోకిశీల, రావికోన పంచాయతీల పరిధిలో గ్రామాల్లో భర్తలను కోల్పోయిన మహిళలకు వెంటనే పింఛను మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వీరి ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతువులకు ఎలాంటి ఆధారమూ లేదని, పిల్లలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గత రెండు సంవత్సరాల క్రితం భర్తలు మరణించడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా పేద గిరిజన, దళిత మహిళలకు పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం

కలెక్టరేట్ ఎదుట ధర్నా

మండలంలో సంగంవలస పంచాయతీలో సీతంపేట గ్రామస్తులకు గత కొన్నాళ్లుగా రెవెన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికా రులు కలిసి ఉమ్మడి సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. కానీ ఈ మధ్యకాలంలో రెవెన్యూ అధికారులు ఈ సర్వే అర్ధాంతరంగా నిలిపివేశారని చెప్పారు. రెవెన్యూ జిల్లా అధికారులు వెంటనే సర్వే చేసి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పాలమెట్ట రాము, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, సూరిబాబు, మహిళా సంఘం నాయకురాలు వరాలు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలను పరిష్కరించాలి

అరకు ఎమ్‌పి గుమ్మ తనూజారాణి

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేయాలని అరకు ఎమ్‌పి గుమ్మ తనూజారాణి.. అధికారులకు సూచించారు. సోమవారం సీతంపేట ఐటిడిఎలో పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు నిర్వహించి గిరిజన సమస్యలు పరిష్కరించాలని ఆమె తెలిపారు. గిరిజన గ్రామాల్లో చాలా సమస్యలు ఉన్నాయని, ప్రధానంగా తాగునీరు, కాలువలు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ఇప్పటికీ కరెంటు లేని గ్రామాలు ఉన్నాయని, వాటికి విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంకా డబ్బులు జమ కాని వారికి డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కొండ ప్రాంతాల్లో నిర్మించిన రోడ్లకు మలుపుల వద్ద రక్షణ గోడలు నిర్మించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో గంజాయి వినియోగాన్ని అరికట్టాలన్నారు. గురుకుల పాఠశాలల్లో 5, 6 తరగతులకు సంబంధించి అదనపు సీట్లను పెంచాలని సూచించారు. ప్రభుత్వ అధికారిక సమావేశాలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. వైస్ ఎంపిపి కె.సరస్వతి మాట్లాడుతూ ఏజెన్సీలో గంజాయి ని అరికట్టాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్‌పి తనూజారాణి

అనంతరం ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికీ విద్యుత్ సదుపాయం లేని గిరిజన గ్రామాలను సర్వే చేసి, జాబితాను సమర్పించాలని విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. తల్లికి వందనం డబ్బులు జమ కాని వారికి డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాలకవర్గ సమావేశ నిర్వహణపై ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశామని వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి లక్ష్మి, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, వైస్ ఎంపిపి కె.సరస్వతి, సర్పంచ్ కళావతి, ఆదిలక్ష్మి, తిరుపతిరావు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ గున్న రామ్మోహన్‌రావు, వెలుగు ఎపిడి సన్యాసిరావు, పిహెచ్ఒ గణేష్, ఉపాధి ఎపిడి శ్రీహరిరావు, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పిజిఆర్ఎస్‌కు 160 వినతులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులపై అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు స్పష్టంచేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెసి ఎస్.ఎస్.శోభిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణితో కలిసి ప్రజల నుంచి 160 వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. తద్వారా అర్జీదారుడు సంతృప్తి చెందాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన వినతులను ఆయా శాఖాధికారులకు సూచిస్తూ, వాటిపై సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ, పింఛన్లు, రేషన్ కార్డులు, ఉపాధి అవకాశాలు, గృహాలు, ఇళ్ల పట్టాలు, భూ వివరాల నమోదు తదితర అంశాలకు చెందిన అర్జీలు ఉన్నాయి. అర్జీల్లో కొన్ని...

అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- గరుగుబిల్లి మండలం చినగుడబ నుంచి మేడిశెట్టి మంజు అర్జీని అందిస్తూ, తన తల్లి మరణించిందని, వారసత్వంగా తాను సాగు చేసుకుంటున్న రెండు ఎకరాల భూమికి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరారు.
- లద్దో నుంచి బండబాయి, బండబాయి నుంచి చింతామల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సాలూరు మండలం బండబాయి నుంచి మెలిక రామ వినతి పత్రాన్ని అందించారు.
- పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న తమకు గత 10 నెలల నుంచి జీతాలు చెల్లించలేదని, వెంటనే వాటిని మంజూరు చేయాలని ఎ.రాజారావు, వై.శిరీష తదితరులు కోరారు.
- సీతానగరం మండలం ఆర్.వెంకంపేట నుంచి దాకేటి శ్రీదేవి అర్జీ అందిస్తూ తన భర్త మరణించి ఏడేళ్లు అయినప్పటికీ తనకు వితంతు పింఛను మంజూరు కాలేదని, పింఛను ఇప్పించాలని కోరారు.
- 10 ఎకరాల మెట్ట భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఉందని తప్పుగా నమోదు కావడంతో తల్లికి వందనం పథకం తమకు వర్తించలేదని, దాన్ని సరిచేసి ఇప్పించాలని కొమరాడ మండలం గూనకళ్లు నుంచి కొండగొర్రి భీమారావు కోరారు.
- జియ్యమ్మవలస మండలం ఎం.అల్లువాడ నుంచి లోలుగు లక్ష్మి అర్జీని ఇస్తూ వికలాంగుల పింఛను వస్తూ ఆగిపోయిందని, దాన్ని పునరుద్ధరించాలని కోరారు.
- రేషన్ కార్డులో తన కుమారుడి పేరు నమోదు కావడం లేదని, ఆ సమస్యను పరిష్కరించాలని పార్వతీపురం మండలం అడ్డాపుశీల నుంచి సూర్ల రాజు కోరారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇవ్వాలని వినతి

పార్వతీపురం టౌన్ : పట్టణంలో మూడో వార్డు పరిధిలోని బాపూజీకాలనీకి తాగునీరు ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ.. డిఆర్ఒ కె.హేమలతకు వినతి పత్రాన్ని అందజేశారు. బాపూజీ కాలనీలో 16 కుటుంబాలు మాత్రమే నివశిస్తున్నాయని, వారంతా వికలాంగులు, వృద్ధులేనని తెలిపారు. కాలనీలో నాలుగు కొళాయిలుంటే, ఒక కుళాయి ద్వారా మాత్రమే నీరు వస్తుందని, అది కూడా వారానికి ఒకసారి మాత్రమేనని వివరించారు. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

బాధితులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చిన సిఐటియు నాయకులు

భోజన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

పార్వతీపురం : బలిజిపేట మండలంలోని అరసాడ జెడ్‌పి హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్లో 22 సంవత్సరాలుగా పని చేస్తున్న భోజన కార్మికులను, ఇతర సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని సిఐపియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కి గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తొలగించిన గొడవ చినపార్వతి, అరసాడ అప్పుడు, ఈశ్వరమ్మ, కొట్టిస కళావతిని విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా జిల్లా అధికారులు తాత్సారం చేయడం దుర్మారమని చెప్పారు. వారిని విధుల్లోకి తీసుకోకపోతే జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

గత సమ్మె కాలం నాటి ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల 17 రోజుల సమ్మె సందర్భంగా మున్సిపల్ పరిపాలన అధికారులు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరి మార్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ వయస్సు పెంచాలని, అంతవరకూ 60 ఏళ్లకు రిటైర్ అవుతున్న వారికి నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ప్రమాద వశాత్తూ, అనారోగ్యంతో మరణిస్తున్న వారి కుటుంబాలకు నష్టపరిహారం పెంచి ఇస్తామన్నారని నేటికీ జిఒ ఇవ్వ లేదని తెలిపారు. దహన సంస్కారాలకు ఇచ్చే మట్టి ఖర్చులు పెంచి ఇస్తామన్న జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలో పెరిగిన ప్రజలకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పనిముట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమానికి విశాఖపట్నంలో విధులు నిర్వహించిన కార్మికులకు ప్రయాణ, వసతి భత్యాలు నేటికీ చెల్లించలేదన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కాకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, రాజేష్, గంగరాజు, నాగ వంశపు శంకరరావు, మామిడి శివ, బంగారి రాజేష్, గంగయ్యలు, రవి, గంగరాజు, ఇప్పలమ్మ, పాపులమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

పాలకొండ.. మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన

పాలకొండ : నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె సందర్భంగా సోమవారం మోకాళ్లపై నిలబడి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ చర్చల పేరుతో గత పది నెలల నుండి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. షరతులు లేకుండా తల్లికి వందనంతో పాటు కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. జిఒ 36 ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు జిఒలు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వై.హరిబాబు, వై.సురేష్, ఎస్.బాబురావు, పి.రమేష్, ఐ.రాజు, కె.రాజేష్, నర్సింగరావు, పి.సాయి, పి.సతీష్, జి.నారాయణ, బి.సురేష్, సిహెచ్.సంజీవి తదితరులు ఉన్నారు.

ఏనుగుల దాడిలో ధ్వంసమైన మిల్లు షట్టర్

రైస్‌మిల్లుపై ఏనుగుల దాడి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో ఏనుగుల బీభత్సం కొనసాగుతూనే ఉంది. జియ్యమ్మవలస మండలం పెదమేరంగి గ్రామంలో సాయిగాయత్రి మినీ మోడ్రన్ రైస్‌మిల్లులోకి ఆదివారం అర్ధరాత్రి చొరబడి తలుపులను ధ్వంసం చేశాయి. పెదమేరంగి జంక్షన్ వద్ద పండ్ల జ్యూస్ దుకాణాన్ని పూర్తిగా ధ్వంసం చేశాయి. ఆ సమయంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మరోసారి ఏనుగుల దాడితో సమీప గ్రామంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

17న 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ'

మాజీ ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో ఈ నెల 17న బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయంలో సోమవారం పట్టణంలోని వైసిపి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 17న సాయంత్రం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, అరకు పార్లమెంట్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. పట్టణంలోని వైసిపి శ్రేణులంతా హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు చందాన ఆనంద్, బిసి సెల్ అధ్యక్షులు గొర్లి మాధవరావు, వార్డు కౌన్సిలర్లు సువ్వాడ లావణ్య, యడ్ల త్రినాథ, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు సర్వీశెట్టి శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ షఫీ, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి పారిశుధ్య పక్షోత్సవాలు

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల 15 నుంచి 30 వరకు పారిశుధ్య పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారి టి.నాగభూషణరావు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీటి కాలువల్లో పూడిక తీయించడం, బ్లీచింగ్ వేయడం, చెత్తను శుభ్రం చేయడం, తొలగించిన చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించడం వంటి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన సామగ్రి, బ్లీచింగ్, ఇతర ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను శుభ్ర పరచడం, క్లోరినేషన్ చేయడం, నీటి పరీక్షలు నిర్వహణ, మరమ్మతులకు గురైన పైపులను మార్చడం వంటివి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డికె కుమార్ వర్మ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంపై దాడులు

ప్రజాశక్తి-మక్కువ

మండల కేంద్రంలో శ్రీ విజయ దుర్గ ఎరువుల దుకాణంపై వ్యవసాయ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ కె.చంద్రశేఖర్ రావు, పి.రమణయ్య, రవీంద్ర సోమవారం సాయంత్రం దాడులు చేశారు. షాపులో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, రశీదులను తనిఖీ చేశారు. 146 బ్యాగులకు నందు ఎరువుల నిల్వ, బిల్లు పుస్తకం ఎరువులు లైసెన్స్, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్,రసీదులు తనిఖీ చేయగా, క్రిభ్కో కంపెనీ శివారిక బయో స్టిమ్యులెంట్ 146 బ్యాగులకు ఒ ఫారం లేకపోవడంతో స్టాప్ సేల్ నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో ఎఒ చింతల భారతి పాల్గొన్నారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కురుపాం

దోమల నివారణలో భాగంగా కురుపాంలో గౌడవీధి, గాంధీనగర్, నెయ్యలవీధి తదితర ప్రాంతాల్లో ఐఆర్ఎస్ ఎసిఎం ద్రావణాన్ని స్ప్రేయింగ్ చేశారు. ఈ ప్రక్రియను రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి చీకటి శంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నిర్మూలనలో భాగంగా చేపడుతున్న స్ప్రేయింగ్‌కు ప్రజలు సహకరించి, ఇళ్లల్లో పిచికారీ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, పంచాయతీ ఇఒ కె.సురేష్ కుమార్, మలేరియా సబ్ యూనిట్ సూపర్వైజర్లు కె.రాధాకృష్ణ, రాజశేఖర్, ఎంఎల్‌హెచ్‌పి యు.ప్రత్యూష, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రకృతిసాగులో ప్రథమ స్థానంలో నిలవాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయంలో మన్యం జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం జియ్యమ్మవలస మండలం అలమండ పంచాయతీ నీలకంఠపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పాటించే పద్ధతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 75319 మంది రైతులు 1,52,139 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో మొత్తం రైతులు జీవామృతాలు తయారు చేసుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరించడం, అందరూ కిచెన్ గార్డెన్ వేసుకోవడం, కుటుంబ ఆహార భద్రత సాధించడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్, టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరామ్ పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - కురుపాం

నూతన పద్ధతిలో పంటలు సాగు చేయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని ఎన్ఎఫ్ఎలు జి.అన్నపూర్ణ, సిహెచ్.శారద అన్నారు. సోమవారం మండలంలోని దురిబిలి గ్రామంలో తాడు మార్కింగ్ సహాయంతో వరి, మినుములు, పెసర, గోంగూర, తోటకూర, బెండ విత్తనాలు వేసే సాగు పద్ధతిపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ప్రక్రియ వల్ల ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా అందుతాయని చెప్పారు. దాంతోపాటు నర్సరీ, దమ్ము, నాట్లు వేసే ఖర్చు సుమారు ఒక ఎకరాకు రూ.6 వేలు వరకు మిగులుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.ప్రసాద్, దాశరథి, సత్యనారాయణ, నాగేశ్వరావు, రైతులు టి.సుందర్రావు, పూర్ణమ్మ, కుమార్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు నాగేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-సాలూరు

సీనియర్ జర్నలిస్టు గర్భాపు నాగేశ్వరరావు సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆరోగ్యం బాగోలేదని విశాఖపట్నంలో ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేరిన నాగేశ్వరరావు అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. నాగేశ్వరరావు ప్రజాశక్తి, లీడర్ పత్రికల్లో పని చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గత 30 సంవత్సరాలుగా జర్నలిస్టుగా పని చేస్తున్నారు. ఆయన మృతి పట్ల మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్ నాయకులు, జర్నలిస్టులు ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

పూడికలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-వీరఘట్టం

తమ వీధిలో ఉన్న కాలువలో పూడికలు తొలగించాలని మండల కేంద్రంలోని రెల్లివీధికి చెందిన యువకులు పిజిఆర్ఎస్‌లో వినతి అందించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ డి వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పూడికలు తొలగించకపోవడంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని యువకులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శంకర్రావు, వెలుగు ఎపిఎం కె.రాము, ఐసిడిఎస్ సూపర్వైజర్ జె.జ్ఞానమ్మ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 30 నాటికి పిఎం జన్‌మన్ పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఉన్నతాధికారులు

పిఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన పనులను సెప్టెంబర్ 30వ తేది నాటికి పూర్తి చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభూ నాయర్ అన్నారు. పిఎం జన్‌మన్, ఆది కర్మయోగి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 మార్చి తరువాత పిఎం జన్‌మన్ పనులకు నిధులు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. పనులను తక్షణం పూర్తి చేయాలని సూచించారు. ఆది కర్మయోగి పథకం కింద సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి గ్రామాన్ని వారంలో కనీసం రెండుసార్లు సందర్శించి అక్కడి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. సమస్యల పరిష్కారానికి సింగిల్ విండో విధానం అవలంబించాలని సూచించారు. ప్రతి గ్రామం సుస్థిర అభివృద్ధి సాధన దిశగా ఉండాలని ఆయన చెప్పారు.

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పిఎం జన్‌మన్ కింద మల్టీపర్పస్ కేంద్రాలను ఆగస్టు నాటికి పూర్తి చేస్తామన్నారు. గృహ నిర్మాణాలను సెప్టెంబర్‌కి పూర్తి చేస్తామని, మంజూరైన 19 రహదారులను 9 నెలలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. జిల్లాలో మూడు వసతిగృహాలు మంజూరయ్యాయన్నారు. జలజీవన్ మిషన్ పనులకు టెండర్లను పిలిచామని, నవంబర్ 15 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో 190 మొబైల్ టవర్లు మంజూరు కాగా 137 మొబైల్ టవర్లను నిర్మించామని తెలిపారు. వీటి నిర్మాణానికి అవసరమయ్యే 11 రహదారులను కూడా మంజూరు చేశామని ఆయన తెలిపారు. ఆది కర్మయోగి పథకం కింద గ్రామాల్లో అభివృద్ధి చర్యలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాలు సింగిల్ విండో విధానంలో పనిచేస్తున్నాయని వివరించారు. కంటైనర్ హాస్పిటల్, అంగన్వాడీ కేంద్రాలను దూరపు ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు అతి చేరువకు తీసుకొచ్చామన్నారు. గ్రామాల్లో వైద్య పరీక్షలను అందుబాటులోకి తెచ్చామన్నారు. వైద్యాధికారి ప్రతి నెలలో నాలుగు నుంచి ఆరు సార్లు సందర్శించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అపారిశుధ్యం ఉండటం వల్ల మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి ఎక్కువ ఉన్నట్లు గుర్తించామని, అందుకు అన్ని చర్యలు చేపట్టి ఆరోగ్యకర వాతావరణం నెలకొల్పుటకు కూడా చర్యలు చేపట్టామని వెల్లడించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, సీతంపేట ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి జి.చినబాబు, ఇపిడిసిఎల్ ఎస్ఇ కె.మల్లికార్జునరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిఇ రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి విఎస్ నగేష్, జిల్లా విద్యా శాఖ అధికారి రాజ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎన్.కృష్ణవేణి, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఇ.అప్పన్న, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి వై.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 95 వినతులు

వినతులు స్వీకరిస్తున్న డిడి అన్నదొర

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో సోమవారం ట్రైబల్ వెల్ఫేర్ డిడి అన్నదొర ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్ (గ్రీవెన్స్) నిర్వహించారు. ఐటిడిఎ పరిధిలోని అర్జీదారుల నుంచి 95 వినతులు వచ్చాయి. కుంభి గ్రామానికి చెందిన నిమ్మక ఆనంత్ బోరు మంజూరు చేయాలని కోరారు. కిల్లాడకు చెందిన హారిక ఆనందరావు వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని విన్నవించారు. తుప్పలగూడకు చెందిన బిడ్డగా బుడ్డయ్య నిలిచిన తాగునీటి పనులు పూర్తి చేయాలని వినతి అందించారు. సీతంపేటలో ఉన్న సరస్వతి విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు రహదారి సౌకర్యం కల్పించాలని సీతంపేటకు చెందిన సవర చిన్నబాబు కోరారు. పెద్దపొల్లకు చెందిన కొండగొర్రె సుందరమ్మ తన అన్నయ్య మృతి చెందారని, మరణ ధ్రువ పత్రం ఇప్పించాలని కోరారు. మోహన్ కాలనీకి చెందిన బిడ్డకు వెంకటేష్ సిసి రోడ్డు మంజూరు చేయాలని విన్నవించారు.

ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్, పిహెచ్ఒ వెంకట గణేష్, డిప్యూటీ ఇఒ రామ్మోహన్ రావు, వ్యవసాయ అధికారి వై.వాహిని, సూపరింటెండెంట్ అప్పారావు, డిప్యూటీ ఎంపిడిఒ కె.సత్యం, డిఎంఒ సత్యనారాయణ, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, ఐటిడిఎ స్పోర్ట్స్ నోడల్ అధికారి దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సంధ్యారాణి

మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వం లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం మండలంలోని కేసలి గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ కొంతమంది సర్పంచులు అభివృద్ధి పనులకు అడ్డం తగులుతున్నారని చెప్పారు. ప్రజా సంతకాల తీర్మానంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వైసిపి నాయకుల దుష్ప్రచారాలను నమ్మవద్దని కోరారు. 151 నుంచి 11 సీట్లకు ప్రజలు పరిమితం చేసినా జగన్మోహన్ రెడ్డికి, ఆ పార్టీ నాయకులకు బుద్ధి రావడం లేదన్నారు. ఎంపిటిసిలను, సర్పంచులను గెలిపించుకుని గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. కేసలి గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గూడెపు యుగంధర్, ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ. చల్లా కనక, మతల బలరాం, కొత్తల పోలినాయుడు, పూసర్ల నర్సింగరావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

అలమండలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం అలమండ పంచాయతీలో టిడిపి మండల అధ్యక్షులు జోగి భుజంగరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, టిడిపి మాజీ మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, ఒట్టిగెడ్డ ప్రాజెక్టు చైర్మన్ ఎం.సత్యంనాయుడు, నాయకులు దత్తి లక్ష్మణరావు, లంక గోపాలం, గురాన శ్రీరామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కార్మికులను మోసగించిన ప్రభుత్వం

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో విజయవాడ తర్వాత ఎక్కువగా మోటారు కార్మికులున్న ప్రాంతాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర విమర్శించారు. సోమవారం పట్టణంలోని 11, 12 వార్డుల్లో ఇంటింటికీ టిడిపి మోసాలపై కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ కార్మికులకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని హామీఇచ్చిన ప్రభుత్వం వారికి మోసం చేసిందని ఆరోపించారు. ఆటోనగర్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఏడాది కాలంలో ఏం చేశారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టే ప్రయత్నంలో ప్రభుత్వం ముందుకెళుతోందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరి రఘు, వైసిపి నాయకులు జి.నాగేశ్వరరావు, ఎంఎస్ నారాయణ పాల్గొన్నారు.


రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

రహదారుల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-మక్కువ

మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన సిమెంటు రహదారులను సోమవారం క్వాలిటీ కంట్రోల్ డిఇ లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారుల నాణ్యత ప్రమాణాలను కోర్ నమూనాలతో సేకరించారు. మార్కొండపుట్టి పంచాయతీ పెదగాసిల గ్రామంలో రహదారికి ఇరువైపులా షోల్డర్స్ నిర్మించక పోవడంతో సంబంధిత వెండర్‌ను ఆయన ప్రశ్నించారు. వెంటనే రెండు రోజుల్లో ఆ పనిని పూర్తిచేయాలని ఆదేశించారు. డి.శిర్లాం, పాయకపాడు, తోటవలస, మక్కువ గ్రామాలలో నిర్మించిన రహదారి పనులను కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఎఇ వెంకటేష్ రాజు, పంచాయతీరాజ్ ఎఇ బూరి రజిత్, ఆయా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహాదేవివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి పంచాయతీ పరిధి మహాదేవివలస గ్రామంలో సోమవారం వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, రక్తపోటు, మధుమేహ, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో. ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

19న గుమ్మలక్ష్మీపురం మండల సమావేశం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 19న గుమ్మలక్ష్మీపురం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ త్రివిక్రమరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి దీనమయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఎరుకులకు ఎస్‌టి ధ్రువపత్రాలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

జియ్యమ్మవలస మండలం తురకనాయుడు వలసలో గత 30 సంవత్సరాలుగా నివశిస్తున్న ఎరుకుల సామాజిక తరగతి ప్రజలకు ఎస్‌టి ధ్రువపత్రాలు ఇవ్వాలని సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ 30 కుటుంబాలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి గతంలో ఎస్‌టి ధ్రువపత్రాలు మంజూరు చేసేవారని, గత ఆరు నెలలుగా తురకనాయుడు వలస విఆర్ఒ ఆ సర్టిఫికెట్లు మంజూరు చేయడం లేదని చెప్పారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వక పోవడంతో వీరి పిల్లలు చదువులకు, ఉద్యోగాలకు దూరం అవుతున్నారన్నారు. గ్రామంలో ఉన్న కొంతమంది వీరికి ఎస్‌టి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వద్దని అడ్డుకోవడంతో విఆర్ఒ ఇవ్వలేకపోతున్నామని చెప్పడం చట్ట విరుద్ధమన్నారు. కులం అనేది జన్మతః వస్తుందని, వీరికి అన్ని చోట్లా ఎస్‌టి కుల ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఆ పత్రాల కోసం దరఖాస్తు పెట్టినప్పటికీ రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు సమగ్రంగా పరిశీలన చేసి వారి హక్కు ప్రకారం ఎస్‌టి ధ్రువపత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజేశ్వరి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు చట్ట పరిధిలో పరిష్కారం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

అర్జీలను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

పిజిఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్‌పి ఎస్.వి మాధవరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 13 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి, మహిళా పిఎస్ హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపి తనూజా రాణి

కూటమిది అరెస్టులు పాలన

ఎంపి తనూజా రాణి

ప్రజాశక్తి -భామిని

ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాల అమలు చేయకుండా, కూటమి ప్రభుత్వం సుపరిపాలన అంటూ అరెస్టులు పర్వం కొనసాగిస్తోందని అరకు ఎంపి గుమ్మ. తనూజారాణి అన్నారు. భామిని మండలం అనంతగిరిలో వైసిపి మండల అధ్యక్షులు బొదేపు శ్రీనుబాబు ఆధ్వర్యంలో మండల స్థాయిలో బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజాదరణ చూసి, రాష్ట్రానికి సిఎం చంద్రబాబా?, జగనా? అనే భ్రమ టిడిపి కూటమిలో కలుగుతోందన్నారు. ప్రజల్లో పూర్తి స్థాయిలో వైసిపికి ఆదరణ ఉందన్నారు. దాన్ని క్షేత్రస్థాయిలో కాపాడాల్సిన బాధ్యత వైసిపి కార్యకర్తదేనని చెప్పారు. ఆ దిశగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో, సంక్షేమ పథకాలు అమల్లో ఎంత వివక్షత చూపిస్తోందో వివరించాలని కోరారు. జగన్ పాలనలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తుచేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వైసిపి కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అయిష్టత ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బొడ్డేపల్లి చిన్నమ్మ, ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, వైసిపి నాయకులు టింగ అన్నాజీరావు, మజ్జి మోహన్‌బాబు, గెల్లంకి రమేష్, కొత్తకోట చంద్రశేఖర్, అగుతముడి రఘు, కొత్తకోట ఆంజనేయులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ దర్శించుకున్న ఎంపి

పాలకొండ : పట్టణంలో కోట దుర్గమ్మ ఆలయాన్ని సోమవారం అరకు ఎంపి తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే వి.కళావతి దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితోపాటు వైసిపి పట్టణ అధ్యక్షులు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపి నాయుడు, నీలా శ్రీనివాసరావు, కడగల రమణ, కె.విజయకుమార్, బాసురు కాంతారావు, దుంపల చిన్ని తదితరులు ఉన్నారు.

దీర్ఘకాలిక రోగులపై పర్యవేక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం మెరుగుకు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు నిడగల్లు గ్రామంలో సంచార చికిత్స కార్యక్రమాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, అందజేస్తున్న చికిత్స వివరాలు రికార్డులో పరిశీలించారు. అనారోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. వ్యాధిగ్రస్తులకు చేపడుతున్న రక్తపరీక్షలను గమనించారు. బిపి, షుగరు, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం ప్రతి నెలా ఏ మేరకు మెరుగవుతుందో పరిశీలించాలని వైద్య సిబ్బందికి సూచించారు. 104 వాహనంలో ఇసిజి పరికరం పనితీరు, మందుల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య తనిఖీల వివరాలు అదేరోజు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇంకా పెండింగ్ ఉన్న ఎన్‌సిడి సర్వే పూర్తి చేయాలన్నారు. కేన్సర్ లక్షణాలు గుర్తిస్తే వెంటనే తెలియపర్చాలన్నారు. అనంతరం అక్కడ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా మాత్రలు వేసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహార నియమావళిపై అవగాహన కల్పించారు. సంచార చికిత్స కార్యక్రమంపై ముందురోజు గ్రామస్తులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమ్య, సూపర్వైజర్ గోపాలరావు, సిహెచ్ఒ ధరణి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించి విమర్శలా? : టిడిపి

ప్రజాశక్తి-కొమరాడ

గత ప్రభుత్వంలో అభివృద్ధిని విస్మరించిన వారు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని టిడిపి మండల అధ్యక్షులు ఎస్.శేఖర్ పాత్రుడు అన్నారు. మాదిలింగి గ్రామంలో టిడిపి ముఖ్య నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. కురుపాం నియోజకవర్గంలో గత వైసిపి పాలనలో నిర్లక్ష్యానికి గురైన అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఏడాది కాలంలో జరుగుతున్నాయన్నారు. పూర్ణపాడు -లాబేసు వంతెన పూర్తి చేయడానికి రూ.5.25 కోట్లను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంజూరు చేయించారని తెలిపారు. ఏనుగుల సమస్య పరిష్కారానికి కుంకి ఏనుగులను మన్యం జిల్లాకు రప్పిస్తున్నారని తెలిపారు. పార్వతీపురం నుండి కునేరు అంతర్రాష్ట్ర రహదారి మరమ్మతులకు సుమారు రూ.6.50 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు.

అసంపూర్తిగా ఉన్న తోటపల్లి-గుణుపూర్ రహదారి వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించి, సుమారు 9 కోట్లు రూపాయలు మంజూరు చేయించి, పెండింగ్ పనులు పూర్తి చేయించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందని తెలిపారు. కురుపాం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, ఎమ్మెల్యే జగదీశ్వరికి ప్రజలలో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక మాజీ మంత్రి పుష్పశ్రీవాణి మాట్లాడుతున్నారని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎంపిటిసి, క్లస్టర్ ఇన్‌ఛార్జి హిమరక బలరాం పాల్గొన్నారు.